నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 24 జనవరి 2024 | ADILABAD

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 23 : నిర్మల్ నియోజకవర్గంలోని లక్ష్మణచాంద, మామడ, సారంగాపూర్, సోన్, నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను అందించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో 259 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కల్యాణి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్ రాజేందర్ పాల్గొన్నారు.

## కందుల కొనుగోళ్లు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, జనవరి 23 : భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు నిర్వహిస్తున్నారని, క్వింటాలుకు రూ.9,147లు ధర పలికినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి అడెల్లు, ఎంపీపీ రజాక్, నాయకులు సొసైటీ చైర్మన్ దేవేందర్, ఏడీఏ వీణ, ఏవో రాంచందర్ నాయక్, పీఏసీఎస్ సీఈవో తానాజీ పాల్గొన్నారు.


గుంజాలలో ఝరికి పూజలు చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## ఝరికి మంత్రి పూజలు

నార్నూర్, జనవరి 23 : గంగాజల సేకరణకు బయలుదేరిన మెస్రం వంశీయులు నార్నూర్ మండలంలోనిగుంజాలలో సోమవారం బస చేశారు. పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి గుంజాల గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామస్తులు స్వాగతం పలుకగా.. ఝరికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్పవని, భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. కేస్లాపూర్ జాతరలో సదుపాయల కల్పనపై ఎమ్మెల్యేతో చర్చించారు. సర్పంచ్ కుమ్ర శావిత్రాబాయి, రాయి సెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు పటేల్, మెస్రం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## నాగల్‌కొండలో మెస్రం వంశీయుల బస


గుంజాల నుంచి పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

నార్నూర్, జనవరి 23 : నాగోబా మహాపూజకు ఉపయోగించే గంగాజల సేకరణకు పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు సోమవారం రాత్రి నార్నూర్ మండలంలోని గుంజాల గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలుకగా.. గ్రామ పొలిమేరలో బస చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్తులందరూ ఝరికి సంప్రదాయ పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కాలినడకన నాగల్‌కొండకు చేరుకోగా పొలిమేరలో స్వాగతం పలికారు. అక్కడే బస చేశారు. బుధవారం జైనూర్ మండలంలోని గౌరికి బయలుదేరనున్నట్లు ఆ వంశం పెద్దలు తెలిపారు.

# పంచాయతీల్లో ప్రత్యేక పాలన

**ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం**

- ఎన్నికలకు సిద్ధంగా లేని కాంగ్రెస్ సర్కారు
- అవసరమైన చర్యలు తీసుకుంటున్న యంత్రాంగం
- స్పెషలాఫీసర్స్ వివరాలను సేకరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో జనవరి 2019 సంవత్సరంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 468 పంచాయతీలకు మూడు విడుతలుగా నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనుండగా.. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనున్నది. ఈ మేరకు జిల్లా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక అధికారులను నియమించడానికి వివరాలను సేకరిస్తున్నారు. పంచాయతీ పాలకుల పదవీకాలన్నీ పొడిగిస్తూ.. పర్సన్ ఇన్‌చార్జిలుగా అవకాశం ఇవ్వాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం కనిపించలేదు.

### అభివృద్ధి పథంలో పల్లెలు

కేసీఆర్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై పూర్తి క్లారిటీ ఇచ్చింది. పదేండ్లపాటు పంచాయతీల్లో ఒకే రిజర్వేషన్ అమలు చేస్తే పల్లెలు ప్రగతి సాధిస్తాయని సూచించింది. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో పల్లెలు ప్రగతిపథంలో దూసుకుపోయాయి. గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేసింది. క్రమంగా నిధులు మంజూరు చేయడంతోపాటు ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించింది. పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు. విద్య, వైద్యం, రవాణ, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. పల్లెల్లో రోడ్లు, మురికికాల్వల నిర్మాణం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, సిగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, రైతు వేదికల నిర్మాణాలు చేపట్టింది. ఫలితంగా పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామ పంచాయతీ

### ప్రత్యేక అధికారులు వీరే..

తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు, వివిధ శాఖల్లో పనిచేసే ఇంజినీర్లు, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు, హార్టికల్చర్ ఏవోలు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, రికార్డ్ అసిస్టెంట్‌లు, ఏఈవోలు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## అభివృద్ధే మంత్రం కావాలి

- ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరాలి
- రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశం
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

ఉట్నూర్, జనవరి 23: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు అభివృద్ధే మంత్రంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. స్థానిక కుమ్రం భీం కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణ, నీటిసరఫరా, విద్యుత్ వంటి సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందిచే దిశగా ప్రభుత్వ పథకాలు అమలు కావాలని సూచించారు. కుమ్రం భీం, హైమన్ డార్ఫ్, బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాల వారీగా సాగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్, వెడ్మ బొజ్జు, నాలుగు జిల్లాల కలెక్టర్లు రాహుల్ రాజ్, బదావత్ సంతోష్, హేమంత్ బోర్కడే, రాహుల్, దీపక్ తివారీ, ఫైజల్ అహ్మద్, ఉమ్మడి జిల్లా అటవీ అధికారులు ప్రశాంత్ బాజీరావు పాటిల్, శివ్ ఆశిష్, నీరజ్, రాంకిషన్, తదితరులున్నారు.


పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు

# ఇసుక దందా

**రాజకీయ నాయకులు, వీడీసీలకు కాసులు కురిపిస్తున్న వ్యాపారం**

- పల్లెల్లో బహిరంగంగా వేలం పాటలు.. సొమ్ము చేసుకుంటున్న వీడీసీలు..
- పట్టించుకోని భూగర్భ, రెవెన్యూ, పోలీసు అధికార యంత్రాంగం

*నిర్మల్ జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దందా కొనసాగుతున్నది. భవన నిర్మాణాలు భారీ సంఖ్యలో జరుగుతుండడంతో విపరీతంగా డిమాండ్ ఉంది. నిర్మల్ పట్టణంతోపాటు, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా రాజకీయ నాయకులు, గ్రామాల అభివృద్ధి కమిటీ(వీడీసీ)లకు ఆదాయ వనరుగా మారింది. వీడీసీలు తమ పరిధిలోని వాగులకు వేలం నిర్వహించి, అనధికారికంగా తవ్వకునేందుకు అనుమతులు ఇస్తున్నాయి. భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోక పోవడంతో దందా నిరంతరాయంగా కొనసాగుతున్నదనే విమర్శలున్నాయి.*


ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ శివారులో ఇసుకను నిల్వ చేసిన వ్యాపారులు

నిర్మల్, జనవరి 23(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతమంతా ఇసుకకు కేంద్ర బిందువుగా మారింది. కడెం, పెంబి, ఖానాపూర్ మండలాల పరిధిలో ప్రవహించే పల్కేరి వాగు దందాకు అడ్డాగా మారింది. అలాగే భైంసా సమీపంలో గల సుద్దవాగు, దాని ఉప వాగుల నుంచి కూడా తరలిస్తున్నారు. చిట్యాల, స్వర్ణ వాగు పరీవాహక ప్రాంతంలోని ఆలూరు, బోరిగాం, కౌట్ల, వెంగ్వాపేట్ గ్రామాలను కేంద్రంగా చేసుకుని పెద్ద మొత్తంలో తీసుకెళ్తున్నారు. చాలా చోట్ల ఇసుక డంపులు కనిపిస్తున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లుగా వదిలేయడం అనుమానాలకు తావిస్తున్నది. ఫలితంగా.. ప్రభుత్వం కోట్లాది రూపాయల రాయల్టీని కోల్పోతున్నది. కాగా.. ఇసుక తరలింపు భూగర్భ జలాలపై కూడా పడనున్నది.

### అంతా వీడీసీల కనుసన్నల్లోనే..

గ్రామాల సరిహద్దు గుండా ప్రవహిస్తున్న వాగులపై అక్కడి వీడీసీలు గుత్తాధిపత్యాన్ని చలాయిస్తున్నాయి. ఇసుకను తరలించేందుకు వేలం పాటలు నిర్వహించి అనధికారిక హక్కులు కల్పిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రశీదులను ముద్రించి అనుమతులను జారీ చేస్తున్నాయని సమాచారం. సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు వీడీసీ మాటకు ఎదురు చెప్పలేని పరిస్థితులు కొనసాగుతున్న కారణంగా ఇసుక దందా దర్జాగా సాగుతున్నది. వీడీసీలు ఇసుకకే కాకుండా బెల్టు షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, చికెన్ దుకాణాలకు కూడా వేలం పాటలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఈ నిధులను అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా.. ఆశించిన అభివృద్ధి కనిపించడం లేదన్న ఫిర్యాదులున్నాయి.


నిర్మల్ శివారులోని చిట్యాల వాగులో ఇసుకను తవ్వుతున్న కూలీలు

### రాజకీయ నేతల హస్తం

ఇసుక దందా వెనుక రాజకీయ నేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలుకుబడి, పరపతితో అధికారులను మచ్చిక చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా అధికారులను పక్కదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా కొన్నిచోట్ల ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ తర్వాత సీజ్ చేసిన ఇసుకకు రహస్యంగా వేలం నిర్వహించడంతో తమ అనుయాయులే తక్కువ ధరకే దక్కించుకుంటున్నారు. ఇలా అంతా ఒక కనికట్టును తలపించే విధంగా కొనసాగుతున్నది. అధికారులు స్పందించి అక్రమంగా సాగుతున్న ఇసుక వ్యాపారాన్ని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బీఆర్‌ఎస్‌ది ఓటమి కాదు..

- కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కింది..
- పథకాల అమలులో రాష్ట్ర సర్కారు పూర్తిగా విఫలమైంది..
- నేటికీ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే ప్రజాక్షేత్రంలో ఉన్నాయి..
- ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి రామన్న

ఎదులాపురం, జనవరి 23 : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీది ఓటమి కాదని, కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని, నేటికీ కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలే ప్రజాక్షేత్రంలో ఉన్నాయని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో గ్రామాలు, పట్టణ కమిటీల సౌజన్యంతో ముందుకెళ్లి ప్రజాక్షేత్రంలో ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతం దిశగా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, ఆత్మ చైర్మన్ రమేశ్, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సాజిదొద్దీన్, ప్రమోద్‌రెడ్డి, సతీశ్‌పవార్, రోకండ్ల రమేశ్, బుట్టి శివ, సలీం పాషా, దాసరి రమేశ్, స్వరూపరాణి, బుడగం మమత, పర్వీన్ ఫిరోజ్, దివిటి రాజు, పర్వీన్ సుల్తాన, కరుణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

# అడవి ఒడిలో ఆరాధ్య దైవం

**సహ్యాద్రి పర్వతాల్లో కొలువైన శార్దూల వాహిని**

- ఆదివాసీ బిడ్డల పుణ్యస్థలం జంగుబాయి క్షేత్రం
- 25న మహాపూజ..నెల రోజులపాటు జాతర
- పూజలకు తరలిరానున్న గిరిజనం


జంగుబాయి గుహలో ఉన్న పోచమ్మ దేవుళ్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, జనవరి 23 : ప్రకృతినే దైవంగా కొలిచే ఆదివాసీలు వారి ఆచారాలు సంస్కృతీ సంప్రదాయాలను కొండకోనల్లోనే నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. సహ్యాద్రి పర్వతాల్లోని తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న గుహల్లో శార్దూల వాహిని జంగు బాయి కొలువై ఉంది. తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి గోండు, పర్ధాన్, కొలాం తెగలకు చెందిన ఆదివాసీలు యేటా పుష్యమాసంలో ఇక్కడికి వేలాదిగా తరలివస్తారు. గురువారం (ఈ నెల 25) నుంచి జరిగే పూజలతో ఇక్కడ వేడుకలు ప్రారంభం కానుండగా, నెల రోజుల పాటు కొనసాగనున్నాయి.

### ఆదివాసీల ఆరాధ్యదైవంగా..

ఆరాధ్యదైవం జంగుబాయిని నియమనిష్ఠలతో కొలిస్తే అంత శుభమే చేస్తుందని గిరిజనుల నమ్మకం. కెరమెరి మండల కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరందోలి పంచాయతీ మహరాజ్‌గూడ అటవీ ప్రాంతంలోని గుహల్లో జంగుబాయి కొలువై ఉంది. కొండకు ఆనుకొని ప్రవహిస్తున్న వాగులో భక్తులు పుణ్యస్నానాలు చేసి జంగుబాయికి మొక్కులు తీర్చుకుంటారు. ఏడాదికి ఒకసారి జరిగే జాతర సమయంలో నిత్యం వేలాది మంది తరలివస్తారు.

### పుష్యమాసం ఎంతో పవిత్రం

ఆదివాసీలకు పుష్యమాసం ఎంతో పవిత్రమైంది. ఈ మాసంలోనే గిరిజనులంతా తమ ఆరాధ్య దేవుళ్లను నిష్ఠతో కొలుస్తారు. పుష్యమాసం నెలవంక కనిపించిన రోజు నుంచి అమావాస్య వరకు పవిత్రమైన రోజులుగా భావిస్తారు. పాదరక్షలు ధరించరు. మద్యపానానికి దూరంగా ఉంటారు. నేలపైనే నిద్రిస్తారు. అత్యంత నిష్ఠతో పూజలు కొనసాగిస్తారు.

### ప్రత్యేక పూజా విధానం..

ఆదివాసీలు తమ దేవుళ్లకు పూజలు చేసేందుకు ఇతర కులాల వారికి అనుమతినివ్వరు. వారిలోనే కొంతమంది పూజాలుగా వ్యవహరిస్తారు. తమ పంటలతోనే దేవుళ్లకు నైవేద్యాన్ని సమర్పిస్తారు. వడ్లను ఇంటి వద్దనే రోళ్లలో దంచి సేకరించిన బియ్యాన్ని పూజలో వాడుకుంటారు. నైవేద్యం కోసం గోధుమ పిండి, పప్పు, బెల్లం అవసరం. పురాతన పద్ధతుల్లో తీసిన నువ్వుల నూనెనే వాడతారు. దీపారాధన కోసం నెయ్యి లేదా నువ్వుల నూనే, ఆముదం నూనెను మాత్రమే వాడుతారు. పూజా సామగ్రితో కాలినడకన జంగుబాయి వద్దకు చేరుకుంటారు. రాత్రిపూట దీపారాధన చేసి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. పుణ్యక్షేత్రం వద్ద తుమ్రం, కొడప, సలాం, రాయిసిడాం, వెట్టి, మరప, హెర్రె కుమ్ర, మందాడి (8) గోత్రాల కటోడాలు(పూజారులు) పూజలు చేస్తారు. డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య దీపారాధన చేస్తారు. అక్కడి నుంచి మైసమ్మ, పోచమ్మ, రావుడ్క్ వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి దేవుడి పాటలు పాడుతూ అమ్మవారిని ఆరాధిస్తారు. మరుసటి ఉదయం సంప్రదాయ వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకుంటారు. ఇలా నెల రోజుల పాటు ఇలాగే పూజలు కొనసాగుతాయి.

# చదవనిద్దాం..ఎదగనిద్దాం..

- ఆడపిల్లలను కాపాడుకుందాం..
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

కోటపల్లి, జనవరి 23: ఆడపిల్లల సాధికారతకు విద్య మూలస్తంభం. చదువుతోనే బాలికల ఉన్నతికి మార్గం సాధ్యమవుతుంది. ఆడ పిల్లల శ్రేయస్సు, వారి విద్య పట్ల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. బాలికల విద్య కోసం కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, గురుకులాలు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి విద్యకు, బంగారు భవితకు బాటలు వేసింది. ఆడపిల్లల పట్ల వేధింపులకు పాల్పడిన వారిని, వివక్షకు గురి చేసివారిని గుర్తించి వారికి కఠిన శిక్షలు అమలు పరిచి బాలికా శ్రేయస్సుకు కృషి చేసింది. మొట్టమొదటగా 2008లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారు. దేశంలో ఆడపిల్లల పట్ల వివక్షపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారు.



కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వేసిన ముగ్గు

### విద్య ద్వారా సాధికారత

బాలికా సాధికారత విద్య ద్వారానే సాధ్యమవుతుంది. ఆడ పిల్లలు చదువుకున్నప్పుడే కుటుంబం బాగుపడుతుంది. అందుకే బాలికల చదువుకు ప్రభుత్వాలు ప్రథమ ప్రాముఖ్యతను కల్పించాయి. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆడ పిల్లలు నేడు అన్ని రంగాల్లో రాణించి విజయాలు సాధిస్తూ ముందుకెళ్తున్నారు. జిల్లా పోలీస్ శాఖ కూడా బాలికల్లో భరోసా నింపేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నది. షీ టీం ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

### విద్యనే భరోసా



బాలికలకు విద్యనందించడమే భరోసాను కల్పిస్తుంది. ఆడపిల్లలు విద్య నభ్యసిస్తేనే ఆ కుటుంబం బాగుపడుతుంది. స్థానికంగా ఉన్న అవకాశాలును అందిపుచ్చుకొని ముందుకు సాగాలి. బాలికా విద్య కోసం ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ముందుకెళ్లాలి.

-హరిత కేజీబీవీ, ఎస్వో కోటపల్లి